సాక్షి
నల్లగొండ
శుక్రవారం ၊ 22 ၊ మార్చి ၊ 2024



బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. - 8లో



ఈజీ మనీ కోసం..

ఈజీ మనీ కోసం చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-34 (శుక్రవారం సా॥)

సహర్ 4-56 (శనివారం ఉ॥)

న్యూస్‌రీల్

'నిబంధనలకు విరుద్ధంగా విధులు అప్పగిస్తున్నారు'

నల్లగొండ: నల్లగొండలో ఇంటర్మీడియట్ పేపర్ల మూల్యాంకనంలో డీఐఈఓ నిబంధనలకు విరుద్ధంగా విధులు అప్పగిస్తున్నారని ప్రభుత్వ కళాశాల జూనియర్ లెక్చరర్లు ఆరోపించారు. ఈమేరకు తగిన చర్యలు తీసుకోవాలని గురువారం కలెక్టర్ హరిచందనకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులకు ప్రాధాన్యత ఇచ్చిన తర్వాత మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లకు బాధ్యతలు అప్పగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు జరుగుతుండడంతో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాల్సి ఉండగా.. ఆ విధులు వదిలేసి ఇంటర్మీడియట్ పేపర్ల మూల్యాంకన విధుల్లో పాల్గొంటున్నారని, దీంతో విద్యార్థులకు నష్టం జరుగుతుందని తెలిపారు. డీఐఈఓ మొదట జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న రెగ్యులర్ అధ్యాపకులకు మొదట అవకాశం ఇచ్చి, సరిపోకపోతే బయట నుంచి అధ్యాపకులను తీసుకోవాలని నిబంధన ఉందన్నారు. అవేమీ పట్టించుకోకుండా 1:1 నిష్పత్తిలో బాధ్యతలు అప్పగిస్తున్నారని, దీంతో తమకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంగ్లిష్ పరీక్ష

నల్లగొండ: నల్లగొండ జిల్లాలో గురువారం పదో తరగతి ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈఓ భిక్షపతి తెలిపారు. తొమ్మిది పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 19,207 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

నల్లగొండ: ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్సీ అభ్యర్థులకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు నిర్వహించే డీఎస్సీ ఉచిత శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ గురువారం తెలిపారు. tsstudycircle.co.in/ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 84650 35932 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి: ఎన్నికలు సజావుగా జరిగేందుకు సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ పూర్ణచందర్ అన్నారు. గురువారం నార్కట్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నకిరేకల్ నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సెక్టార్ ఆఫీసర్లకు నిర్వహించిన ఎన్నికల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులు కీలకమైనవి, ప్రతీది చాలా జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశ్వర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, లాల్‌బహదూర్ శాస్త్రి, రాజు, జమీరుద్దీన్, ప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

కమ్ముకున్న కరువు

ఉమ్మడి జిల్లాల్లో లక్ష ఎకరాలకు పైగా ఎండిపోయిన వరి

అన్నదాత వరిగోస

- నెర్రెలుబారిన పొలాలు.. పశుగ్రాసంగా మారిన వరి పంట
- సాగర్‌లో నీటి లభ్యత లేకపోవడంతో ఎడమ కాల్వకు విడుదల కాని సాగునీరు
- 16 మీటర్ల లోతుకు పడిపోయిన భూగర్భజలాలు.. అడుగంటిన బోరుబావులు



ఈయన తిప్పర్తి మండలంలోని ఎర్రగడ్డలగూడెం గ్రామానికి చెందిన కూసుకుంట్ల నర్సిరెడ్డి. ఆరు ఎకరాల్లో వరి వేశాడు. రెండు బోర్లు వేసినా ఉపయోగం లేకుండా పోయింది. ఐదు ఎకరాల పొలం ఎండిపోయింది. దీంతో అందులో గేదెలను మేపుతున్నాడు. వేసిన రెండు బోర్లకు, పంట పెట్టుబడికి రూ.2 లక్షలు ఖర్చయింది.



ఈ ఫొటోలోని వ్యక్తి గరిడేపల్లికి చెందిన చామకూరి సత్యం. ఇతను మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశాడు. సాగర్ ఎడమ కాలువ ఆధారంగా పారే తాళ్లవాగులో నీరు లేకపోవడంతో వరిపొలం ఎండిపోయింది.



ఈయన వనం రాములు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలంలోని కూరెళ్ల గ్రామం. రెండెకరాల్లో వరి వేశాడు. అందుకు రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టాడు. బావిలో నీరు అందకపోవడంతో గతేడాది నుంచి 11 బోర్ల వరకు వేసినా చుక్క నీరు కూడా పడలేదు. బోర్ల కోసం రూ.4.10లక్షల వరకు అప్పు చేశాడు. పొట్ట దశలో ఉన్న వరిచేనుకు నీరు అందకపోవడంతో పంట ఎండిపోయింది.



కట్టంగూర్ మండలం బొల్లేపల్లి గ్రామంలో ఎండిపోయిన వరి పొలాన్ని చూపుతున్న రైతు శేఖర్

సాగైన పంట విస్తీర్ణం, ఎండిపోయిన వరి విస్తీర్ణం (ఎకరాల్లో)

నియోజకవర్గం	వరిసాగు	ఎండిపోయింది (అంచనా)
నల్లగొండ	88,193	18,754
నకిరేకల్	1,24,378	9,900
దేవరకొండ	34,488	330
మునుగోడు	46,466	3,790
నాగార్జునసాగర్	76,700	15,200
మిర్యాలగూడ	82,119	17,500
సూర్యాపేట	96,776	10,060
తుంగతుర్తి	1,34,415	4,980
హుజూర్‌నగర్	88,511	10,270
కోదాడ	1,29,035	20,500
ఆలేరు	1,09,089	2,481
భువనగిరి	1,03,000	1,031



యాదగిరిగుట్ట మండలం మహబూబ్‌పేటలో నీరు లేక ఎండిపోయిన వరి పొలం



దామరచర్ల మండలం కల్లెపల్లిలో ఎండిపోయిన వరి పొలంలో జీవాలను మేపుతున్న రైతు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అన్నదాత కరువు కోరల్లో చిక్కుకున్నాడు. సాగు చేసిన వరి పంట నీరు లేక చేతికందడం లేదు. ఈ ఏడాది సరైన వర్షాలు లేక ఎగువ నుంచి వరదలు రాకపోవడంతో రిజర్వాయర్లు వట్టిపోయాయి.. చెరువులు ఎండిపోయాయి. భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లు పోయడం లేదు. కాలువల ద్వారా ఒక్కసారైనా సాగునీరు ఇస్తారన్న ఆశతో యాసంగిలో సాగు చేసిన వరిపంట చేతికి అందకుండా పోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షకు పైగా ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు అనధికారిక అంచనా. 'సాక్షి' నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో తీవ్ర కరువు పరిస్థితులు వెలుగు చూశాయి.

16 మీటర్ల లోతుకు భూగర్భజలాలు

చాలా చోట్ల నెర్రెలుబారిన పొలాలు, ఎండిపోయిన వరి, పశుగ్రాసంగా మారిన వరి చేను.. ఇటువంటి దయనీయ పరిస్థితులే ఇప్పుడు దర్శనమిస్తున్నాయి. ఒక్కో మండలంలో వందలు, వేల ఎకరాల్లో వరి ఎండిపోయింది. 2023 జనవరిలో 5 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు 2024 మార్చి నాటికి ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా 10 మీటర్ల నుంచి 16 మీటర్ల లోతుకి పడిపోయాయి. పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని పెడుతూ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా నష్టపోక తప్పడం లేదు.

లక్ష ఎకరాల్లో వరి పంట పోయింది..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగిలో 11,13,170 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అందులో 1,14,796 ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు అనధికారికంగా పేర్కొంటున్నాయి. నల్లగొండ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 4,52,344 ఎకరాల్లో వరి సాగు చేయగా, 65,474 ఎకరాల్లో వరి ఎండిపోయినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు అనధికారికంగా అంచనా వేశాయి. సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 4,48,737 ఎకరాల్లో వరి సాగు చేయగా, 45,810 ఎకరాల్లో వరి ఎండిపోయినట్లు అంచనా వేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 2,12,089 ఎకరాల్లో వరి సాగు చేయగా, 3,512 ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు అనధికారికంగా అంచనా వేశారు.

కొన్ని మండలాల్లో పరిస్థితి ఇదీ..

- నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని పగిడిమర్రి, బుడుమర్లపల్లి, దోరెపల్లి, చిన మాదరం, పొనుగోడు, బోయినపల్లి, దర్వేశిపురం, లింగోటం, పర్వతగిరి గ్రామాల్లో పొలాలు అధిక సంఖ్యలో ఎండిపోయాయి.
- తిప్పర్తి మండలం జంగారెడ్డిగూడేనికి చెందిన పోలెబోయిన లింగస్వామి రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. బోరు ఎండి పోవడంతో 75 శాతం పొలం ఎండిపోయింది.
- కట్టంగూర్ మండలంలో ఏఎమ్మార్పీ డీ-40 కాలువ ద్వారా నీరు వస్తుందని వరి సాగు చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా అధికారులు నీటిని విడుదల చేయలేదు. దీంతో వందల ఎకరాల్లో పంట ఎండిపోయింది. బొల్లేపల్లి గ్రామంలోని పామనగుండ్ల శేఖర్ అనే రైతుతోపాటు ఏడుగురు 150 ఏళ్ల నాటి బావిని నమ్ముకొని 12 ఎకరాల్లో వరి వేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు, కాలువ నీరు రాకపోవడంతో అది కూడా ఎండిపోయింది.
- సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా గోదావరి జలాలు సరిగా రావడం లేదు. దీనికి తోడు భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు బావుల్లో నీరు తగ్గింది. పొట్ట దశలో ఉన్న చేను క్రమంగా ఎండిపోతోంది.
- చివ్వెంల మండలం పాశ్యానాయక్ తండాకు చెందిన ధరావతు సోమాని తనకున్న నాలుగు ఎకరాల్లో వరి వేశాడు. రూ.లక్ష పెట్టుబడి పెట్టాడు. ఉన్న ఒక్క బోరులో నీరు తగ్గి పొలానికి సరిపడక ఎండిపోతోంది.
- మద్దిరాల మండలంలో 13 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, వంద ఎకరాల్లో పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. పొట్ట దశలో ఎస్సారెస్పీ నీళ్లు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి.
- యాదాద్రి జిల్లా వలిగొండ మండలంలో 40 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, 953 ఎకరాల్లో పంట ఎండిపోయినట్లు అనధికారికంగా అంచనా వేశారు. భూదాన్ పోచంపల్లి మండలంలో 28వేల ఎకరాల్లో వరి వేయగా, 50 ఎకరాల్లోని వరి పంట ఎండిపోయింది.
- రామన్నపేట మండలంలో 30వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, సాగు నీరు లేక వెల్లంకి, సిరిపురం, రామన్నపేట కొమ్మాయిగూడెం, జనంపల్లి, ఇస్కిళ్ల, ఉత్తటూరు గ్రామాల్లో దాదాపు 5 వేల ఎకరాల్లో పంట ఎండిపోయింది.

ఏడాదిగా సాగునీటి విడుదల లేదు

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో అత్యధికంగా వరి సాగవుతోంది. ముఖ్యంగా సాగర్ ఎడమ కాలువ, ఏఎంఆర్‌పీ, ఎస్సారెస్సీ కాలువల కిందే ఎక్కువ శాతం పంటలు ఎండిపోయాయి. ఏఎంఆర్‌పీ కింద 2022 ఆగస్టులో సాగు కోసం నీటిని విడుదల చేస్తే, సాగర్ ఎడమ కాలువకు 2023 ఏప్రిల్‌లో ఒకసారి నీటిని విడుదల చేశారు. ఆ తరువాత ఇప్పటివరకు చుక్క నీటిని విడుదల చేయలేదు. గత వానాకాలంలో వర్షాలు లేక పైనుంచి సాగర్‌కు నీరు రాకపోవడంతో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి పడిపోయింది. దీంతో తాగు నీటికి మాత్రమే అప్పుడప్పుడు ఇచ్చారు. ఇక ఇప్పుడైతే కారణం ఏదైనా సాగర్ ప్రాజెక్టు పూర్తిగా కేఆర్‌ఎంబీ పరిధిలోకి వెళ్లిపోవడంతో ప్రభుత్వం సొంతంగా నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది.



చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్‌లో ఎండిపోయిన పొలంలో గేదెలను మేపుతున్న మహిళ

వైద్య శిబిరాలు కొనసాగించాలి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి పీహెచ్‌సీ పరిధిలోని ఎర్రగడ్డలగూడెం, ఇందుగుల గ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిమల్ల కొండల్‌రావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. వైరల్ జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్న ఎర్రగడ్డలగూడెం, ఇందుగుల గ్రామాలను గురువారం ఆయన సందర్శించారు. అంతకు ముందు తిప్పర్తి పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించి ఫీవర్ క్యాంపులో సిబ్బంది సర్దుబాటు, విధుల కేటాయింపుపై సమీక్షించారు. ఫిబ్రవరి నుంచి ఎర్రగడ్డలగూడెంలో 10 డెంగీ కేసులు నమోదు కావడం, ఇందుగులలో జ్వరం బాధితుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున క్యాంపులను కొనసాగించాలని సూచించారు. ఎర్రగడ్డలగూడెంలో ఇంటింటికీ తిరిగి జ్వరం బారిన పడ్డ వారితో మాట్లాడి ఆరోగ్య సూచనలు చేశారు. ఇందుగులలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది నీటి నమూనా సేకరించి పరీక్షలకు పంపించారు. గ్రామంలో 71 మంది రక్త నమూనాలను పరీక్షలకు పంపించినట్లు మండల వైద్యాధికారి రాజేష్ తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రావు, జిల్లా మలేరియా అధికారి దుర్గయ్య, డాక్టర్ ఇక్తియార్, డాక్టర్ ఫిర్దోస్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఎర్రగడ్డలగూడెంలో జ్వర పీడితులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు

ముదురుతున్న టికెట్ల లొల్లి

- భువనగిరి స్థానంపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో తర్జనభర్జన
- ఎవరికి ఇవ్వాలో తేల్చుకోలేకపోతున్న కాంగ్రెస్
- మాజీ ఎమ్మెల్యేకు టికెట్ ఇస్తే పార్టీలోకి వస్తారంటూ ప్రచారం
- ఆయనకు టికెట్ ఇస్తే ఒప్పుకునేది లేదంటున్న ఎమ్మెల్యే
- బీఆర్‌ఎస్‌లోనూ టికెట్ల పంచాయితీ
- భువనగిరిలో తనకు అవకాశం ఇవ్వాల్సిందేనంటున్న 'జిట్టా'
- నల్లగొండ సీటుపైనా వీడని గందరగోళం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో టికెట్ల పంచాయితీ ఇంకా తేలడం లేదు. నల్లగొండ ఎంపీ స్థానం కంటే భువనగిరి స్థానంలోనే ఆ రెండు పార్టీల్లో లొల్లి రాజుకుంది. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి టికెట్ ఇస్తే కాంగ్రెస్‌లో చేరతారని చర్చ సాగుతుండగా, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చే నేతలకు టికెట్ ఎలా ఇస్తారని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు. బీఆర్‌ఎస్‌లోనూ గొడవలు ముదురుతున్నాయి. ఉద్యమకారులను విస్మరిస్తున్నారని, ఇప్పుడైనా తనకు టికెట్ ఇవ్వాలని నల్లగొండలో చెరుకు సుధాకర్ పట్టుపడుతుండగా.. భువనగిరిలో జిట్టా బాలకృష్ణారెడ్డి తనకు టికెట్ ఇవ్వాల్సిందేనని అధిష్టానానికి స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌లో పోటీ తీవ్రం

భువనగిరి ఎంపీ టికెట్ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచరుడు, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు అధిష్టానం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మిని పోటీలో నిలుపాలంటూ రాజగోపాల్‌రెడ్డిపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. సినీ నటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన కూడా టికెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే గుత్తా అమిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి పోటీలో ఉంటారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ ఇవ్వాలనే విషయంలో మల్లగుల్లాలు పడుతోంది. కాంగ్రెస్ అధిష్టానం గురువారం రాత్రి విడుదల చేసిన ఎంపీ అభ్యర్థుల రెండో జాబితాలోనూ భువనగిరి అభ్యర్థిని ప్రకటించలేదు.

పట్టుపడుతున్న జిట్టా..

బీఆర్‌ఎస్ పార్టీలోనూ ఎంపీ టికెట్ల పంచాయితీ కొనసాగుతోంది. భువనగిరి నుంచి బూడిద భిక్షమయ్యగౌడ్, క్యామ మల్లేష్ టికెట్ ఆశిస్తున్నారు. వారితోపాటు జిట్టా బాలకృష్ణారెడ్డి టికెట్ కోసం పట్టు పడుతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో చేరే సమయంలోనే భువనగిరి ఎంపీ టికెట్ ఇస్తామని అప్పట్లో కేసీఆర్ హామీ ఇచ్చినట్లుగా చెబుతున్నారు. తనకు టికెట్ ఇవ్వకపోతే తెలంగాణ భవన్ ఎదుట ఆందోళనకు దిగుతానని కూడా అధిష్టానానికి స్పష్టంగా చెప్పినట్లుగా ఆయన అనుచరులు అంటున్నారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మాత్రం.. భువనగిరిలో బీజేపీ బీసీకి టికెట్ ఇచ్చినందున బీఆర్‌ఎస్ నుంచి బూడిద భిక్షమయ్య గౌడ్‌కు లేదంటే క్యామ మల్లేష్‌కు ఇవ్వాలని అధిష్టానానికి చెప్పినట్లు ప్రచారం సాగుతోంది.

నల్లగొండలోనూ మొదలైన ఆందోళన

నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించగా, బీఆర్‌ఎస్‌లో నల్లగొండ ఎంపీ టికెట్ విషయంలో ఆ పార్టీలో ఇంకా గందరగోళ పరిస్థితే నెలకొంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి తాను పోటీ చేయనని చెప్పడంతో మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వాలని అధిష్టానం భావించి చర్చలు జరిపింది. కానీ ఆయన బీజేపీ నేతలతో టచ్‌లోకి వెళ్లడంతో అది కాస్త ఆగిపోయింది. ప్రస్తుతం నల్లగొండ నుంచి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. అయితే బీఆర్‌ఎస్ పార్టీ ఇంకా ఉద్యమకారులను విస్మరిస్తోందన్న చర్చ ఆ పార్టీలో మొదలైంది. నల్లగొండ ఎంపీ టికెట్‌ను డాక్టర్ చెరుకు సుధాకర్ ఆశిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఆయన తనకు టికెట్ ఇవ్వాలని పట్టుపడుతున్నారు. మరోవైపు చాడ కిషన్‌రెడ్డి కూడా అధిష్టానాన్ని కలిసి టికెట్ ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో నల్లగొండ బీఆర్‌ఎస్ టికెట్‌ను ఓ హోటల్ యజమానికి ఇస్తారనే చర్చసాగుతోంది.

సీపీఎం సింగిల్‌గానే..

- పార్లమెంట్ ఎన్నికల బరిలోకి ఒంటరిగా మార్క్సిస్టులు
- భువనగిరి నుంచి అభ్యర్థి కూడా ఖరారు
- కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా భువనగిరి సీటు అడుగుతున్న సీపీఐ



సాక్షి, యాదాద్రి : లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం ఒంటరిగానే బరిలోకి దిగుతోంది. ఈ మేరకు భువనగిరి స్థానానికి అభ్యర్థిని కూడా ప్రకటించింది. సీపీఐతో కలిసి పోటీ చేయాలని భావించినా.. ఆ పార్టీ కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాలనే యోచనలో ఉండడంతో వెనక్కి తగ్గినట్టు తెలుస్తోంది. కాగా సీపీఎంకు పడే ఓట్ల వల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనేదానిపై చర్చ మొదలైంది.

కమ్యూనిస్టుల ఖిలాగా..

ఉమ్మడి నల్లగొండ జిల్లా 1952నుంచి కమ్యూనిస్టులకు పెట్టని కోటగా ఉండేది. నల్లగొండ, మిర్యాలగూడ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి సీపీఐ, సీపీఐ(ఎం)లు లోక్‌సభలో ప్రాతినిధ్యం వహించాయి. నల్లగొండ నుంచి పీడీఎఫ్ తరఫున రావినారాయణరెడ్డి, డి.వెంకటేశ్వర్‌రావు, సీపీఐ నుంచి రావినారాయణరెడ్డి (1962), బి.ధర్మభిక్షం (1991,1996), సురవరం సుధాకర్‌రెడ్డి (1996,1998)లో విజయం సాధించారు. మిర్యాలగూడ లోకసభ నియోజకవర్గం నుంచి సీపీఎం తరఫు లక్ష్మీదాస్(1962), భీంరెడ్డి నర్సింహారెడ్డి(1971,1984,1998) గెలుపొందారు. అయితే పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మిర్యాలగూడ స్థానంలో భువనగిరి 2009లో ఏర్పాటు అయ్యింది. పునర్విభజన అనంతరం తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో భువనగిరి నుంచి సీపీఎం తరఫున నోముల నర్సింహయ్య, 2024లో చెరుపల్లి సీతారాములు పోటీ చేసి ఓడిపోయారు. 2019లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ తరఫున గోద శ్రీరాములు బరిలోకి దిగి ఓటమిపాలయ్యారు. కాగా ప్రస్తుత ఎన్నికల్లో ఎండీ జహంగీర్‌ను సీపీఎం తన అభ్యర్థిగా ప్రకటించింది. సీపీఎం ఓటు బ్యాంకు ఎవరి జయాపజయాలను ప్రభావితం చేస్తుందో వేచి చూడాలి.

సీపీఐ మద్దతు కోరిన సీపీఎం

భువనగిరి స్థానం నుంచి తమకు మద్దతు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర నాయకత్వం సీపీఐని కోరుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి పోటీ చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు తాము మద్దతు ఇచ్చామని ఆ పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. ఈ క్రమంలో భువనగిరిలో పోటీ చేయని పక్షంలో తమకు మద్దతు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని సీతారాం బుధవారం సీపీఐ రాష్ట్ర నాయకత్వానికి లేఖ రాశారు. అయితే పొత్తు విషయమై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని సీపీఐ నాయకులు చెబుతున్నారు.

కేటాయిస్తే పోటీ.. లేదంటే మద్దతు

ఇండియా కూటమిలో భాగస్వాములైన కాంగ్రెస్, సీపీఐ కలిసి లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. అయితే సీపీఐ.. భువనగిరి, పెద్దపల్లి, వరంగల్, ఖమ్మం, నల్లగొండ స్థానాలు ఇవ్వాలని కోరుతుంది. మొదటి ప్రాధాన్యంగా భువనగిరి సీటును అడుగుతుంది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలోనూ తమకు ఓటు బ్యాంకు ఉన్న సీటు కేటాయించాలని కోరుతుంది. అయితే ఈ విషయంలో కాంగ్రెస్ నాయకత్వం నుంచి ఎలాంటి సానుకూల సంకేతాలు అందలేదు. దీంతో టికెట్ ఇస్తే పోటీ చేయాలని, లేదంటే పొత్తులో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే అంశాన్ని సానుకూల దృక్పథంతో పరిశీలిస్తామని సీపీఐ నాయకుడు ఒకరు 'సాక్షి'తో చెప్పారు.

'నల్లగొండ' పరిధిలో పెరిగిన ఓటర్లు

నల్లగొండ: నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓటర్ల సంఖ్య పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, నల్లగొండ, హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలో 17,18,954 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 8,42,247 మంది, పురుషులు 8,76,538 మంది, ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 69 మంది ఉన్నారు. ప్రస్తుతం షెడ్యూల్ వెలువడటంతో ఇప్పటివరకు ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 17,62,383 మంది ఓటర్లకు చేరింది. అంటే 43,429 మంది ఓటర్లు పెరిగారు. పీడబ్ల్యూడీ ఓటర్లు 33,839 మంది ఉండగా సాధారణ ఓటర్లు 17,19,057 మంది ఉన్నారు. 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 9,487 మంది ఉన్నారు. షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు తిరిగి ఓటు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీంతో ఓటర్ల సంఖ్య మరింత పెరగనుంది.

క్లుప్తంగా

బైక్ పైనుంచి పడి కార్మికుడు మృతి

నకిరేకల్: బైక్ పైనుంచి పడి బొగ్గు బట్టీలో పనిచేసే కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన నకిరేకల్ శివారులోని తాటికల్ రోడ్డులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని పటేల్ నగర్‌లో నివాసముంటున్న బానోతు పెద్దులు(42) తాటికల్‌లోని బొగ్గు బట్టీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగానే బుధవారం రాత్రి బట్టీలో పని ముగించుకుని ఇంటికి బయల్దేరాడు. అప్పటికే మద్యం తాగి ఉన్న పెద్దులు ఓ ద్విచక్రవాహనదారుడిని లిఫ్ట్ అడిగాడు. అతని బైక్ ఎక్కిన పెద్దులు నకిరేకల్ శివారులోకి రాగానే బైక్ పైనుంచి తూలి కిందపడ్డాడు. దీంతో పెద్దులు తలకు బలమైన దెబ్బలు తగలడంతో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

ఎద్దు దాడిలో రైతు మృతి

చింతపల్లి: వ్యవసాయ పొలం వద్ద నిద్రిస్తున్న రైతుపై ఎద్దు దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చింతపల్లి మండల పరిధిలోని పాలెంతండాలో జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన ప్రకారం.. పాలెంతండాకు చెందిన ఇస్లావత్ దేన్య(52) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయంతో పాటు రెండు ఎద్దులు, గేదెలు, మేకలు ఉండడంతో వాటికి కాపలాగా బుధవారం రాత్రి పొలం వద్ద నిద్రించాడు. పశువుల పాకలో ఉన్న ఎద్దు దేన్యపై రాత్రి సమయంలో దాడి చేయడంతో అతడి తల, మెడపై గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం తెల్లవారుజామున గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా మృతుడి భార్య ఇస్లావత్ బిచ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తుల చోరీ

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఓ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన చెరుకు వెంకటేశ్వర్లు రెండు అంతస్తుల భవనంలో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో కలిసి రెండో అంతస్తులో నిద్రిస్తుండగా.. మొదటి అంతస్తులో ఎవరూ లేనిది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళం పగలగొట్టి రూ.18వేలు, 6 తులాలు వెండి పట్టీలు, ఒక సెల్‌ఫోన్, రెండు స్మార్ట్‌వాచ్‌లు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం చోరీ జరిగినట్లు గుర్తించిన వెంకటేశ్వర్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలియజేశారు.

యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



శతఘటాభిషేకం కోసం ప్రధాన కలశాన్ని తీసుకొస్తున్న ప్రధానార్చకుడు, ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి తదితరులు



శృంగార డోలోత్సవం సందర్భంగా రాగాలాపన చేస్తున్న కళాకారులు

- చివరి రోజు ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి శృంగార డోలోత్సవం నిర్వహించిన అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. ఉదయం ఆలయంలో శతఘటాభిషేకం నిర్వహించిన అర్చకులు రాత్రి శృంగార డోలోత్సవం నిర్వహించి ఉత్సవాలను ముగించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్ రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్, పట్టణ సీఐ రమేష్, ప్రధానార్చకులు, ఆలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

108 బంగారు, వెండి కలశాలతో..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధానాలయ ముఖ మండపంలో గురువారం ఉదయం 108 బంగారు, వెండి కలశాలను ఒకే చోట పెట్టి పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ ప్రధానార్చకుడు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకులు, యాజ్ఞాచార్యులు, పారాయణీకులు శతఘటాభిషేకం నిర్వహించారు. అంతకుముందు ముఖ మండపంలో హోమం నిర్వహించి, పూర్ణాహుతి చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు పంచామృతాలు, లవంగాది చూర్ణ, మంత్ర పూర్వక జపములతో అభిషేకించారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న యజ్ఞాచార్యులు, పారాయణీకులు, అర్చకులు, అధికారులు, సిబ్బందికి సన్మానం చేసి ఉత్సవాల సమాప్తికి సూచకంగా మంగళ నీరాజనములు నిర్వహించారు. అదేవిధంగా రాత్రి 9.30 గంటలకు స్వామివారికి శృంగార డోలోత్సవం జరిపించారు. స్వామి, అమ్మవార్లను ఊయలలో వేంచేపు చేసి లాలి పాటలతో, భక్తి గీతాలతో సంకీర్తన గావించారు.

ఆకట్టుకున్న వీణా వాయిద్యం ప్రదర్శన



వీణా వాయిద్యం నిర్వహిస్తున్న వైష్ణవి గోపాల్, బృందం

యాదగిరిగుట్ట: యాదాద్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం హైదరాబాద్‌కు చెందిన వైష్ణవి గోపాల్ తన బృందంతో కలిసి చేసిన వీణా వాయిద్యం ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వైష్ణవి గోపాల్‌తో పాటు తన బృందం సభ్యులను టీటీడీ లోకల్ అడ్వైజరీ సభ్యుడు వడ్లోజు వెంకటేష్ సన్మానించారు.

పరిశోధనా ఫలాలు రైతులకు చేరువ కావాలి

- జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ రఘురాంరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభిస్తున్న సుధారాణి, రఘురాంరెడ్డి

నల్లగొండ టౌన్: వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రాల్లో జరుగుతున్న పరిశోధనా ఫలాలు రైతులకు చేరువ కావాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ రఘురాంరెడ్డి, విశ్వవిద్యాలయం ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ సుధారాణి, పాలెం పరిశోధనా కేంద్రం ఏడీఆర్ మల్లారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఉదయాదిత్య భవన్‌లో జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశాన్ని వారు ప్రారంభించారు. 2024–25 సంవత్సరంలో వానాకాలం, యాసంగి సీజన్‌లో చేపట్టాల్సిన పరిశోధనలు, విస్తరణ అంశాల గురించి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాగులో పంటల వైవిధ్యత, యాంత్రీకరణతో పంటల సాగుపై దృష్టి సారించి కూలీల కొరత అధిగమించే దిశగా రైతులను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు ఆ దిశగా పరిశోధనలు చేయాలన్నారు. 25 శాతం మంది పైచిలుకు రైతులు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వచ్చే విస్తరణ సేవలను పొందుతున్నారని, పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు క్షేత్ర స్థాయిలో ప్రదర్శనలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా పాలెం పరిశోధనా కేంద్రంలో చేస్తున్న పరిశోధనలను డాక్టర్ వాణిశ్రీ వివరించారు. వ్యవసాయ స్థితిగతులు, ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్లు భరత్‌భూషణ్‌రావు, లక్ష్మణ్, కేవీకే, పాలెం, కంపాసాగర్ కోర్డినేటర్లు ప్రభాకర్‌రెడ్డి, సుల్తాన్, శ్రీనివాస్, లావణ్య, రమణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఆయా జిల్లాల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో గాయాలు

మర్రిగూడ: మేడపై నిద్రిస్తున్న బాలికపై కోతులు దాడి చేసి గాయపరిచాయి. ఈ ఘటన గురువారం మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో జరిగింది. వివరాలు.. యరగండ్లపల్లి గ్రామానికి చెందిన గట్ల వెంకటేశ్వర్లు, సుజాత దంపతులు బుధవారం రాత్రి తమ 9ఏళ్ల కుమార్తె ధరణితో కలిసి ఇంటి మేడపై నిద్రించారు. గురువారం తెల్లవారుజామున మేడ పైకి రెండు కోతులు వచ్చి ధరణిపై దాడి చేయడంతో ఆమె చేతికి స్వల్ప గాయాలయ్యాయి. తేరుకున్న తల్లిదండ్రులు కోతులను తరిమివేశారు. అనంతరం మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగానే సాగుతున్నాయి

- రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్

మిర్యాలగూడ: మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లుల్లో ధాన్యం కొనుగోళ్లు సజావుగానే సాగుతున్నాయని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, స్థానిక మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ తెలిపారు. గురువారం మిర్యాలగూడలోని మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రతి రోజు 3,500కు పైగా ధాన్యం ట్రాక్టర్లు మిల్లుల వద్దకు వస్తున్నాయని, వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లుగా కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇతర జిల్లాల ధాన్యంతో కలుపుకొని ప్రతిరోజు 5వేలకు పైగా ట్రాక్టర్ల ధాన్యం వస్తున్నాయన్నారు. పెద్దఎత్తున ధాన్యపు ట్రాక్టర్లు రావడం వలన మిల్లర్లకు ఇబ్బందులు తలెత్తినా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1.50లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇంకా 1.50లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ప్రతి ఏడాది 4 నుంచి 5 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని, ఈసారి పంట దిగుబడి ఆశించనంత రాకపోవడంతో 3లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామని అన్నారు. ప్రతి ఏడాది సీఎంఆర్ కింద 1.70లక్షల టన్నుల ధాన్యం తీసుకుంటున్నామని, ఈ సీజన్‌లో లక్ష టన్నుల ధాన్యం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సీజన్‌లో వర్షాలు లేక సరైన దిగుబడి రాలేదని, వచ్చిన పంటలో కొంత నాణ్యత లోపం ఉందన్నారు. ప్రధానంగా మహేంద్ర చింట్లు, కావేరి చింట్లు, హెచ్ఎంటీ రకం వంటి సన్న రకం ధాన్యం వస్తున్నాయని తెలిపారు. కావేరి చింట్లు, హెచ్ఎంటీ వంటి సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2450కు పైగా ధర ఇస్తున్నామన్నారు. సన్న బియ్యం ఎగుమతికి ప్రభుత్వాలు అనుమతి ఇవ్వాలని, దాని ద్వారా బియ్యం ధర పెరిగి ధాన్యం ధర కూడా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వానికి, అధికారులకు, రైతులకు సహకరిస్తున్నామని, చిన్న చిన్న సమస్యలుంటే వాటిని అధిగమించి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. వారి వెంట వెంకటరమణచౌదరి, గంటా సంతోష్‌రెడ్డి, చిల్లంచర్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం

రామగిరి(నల్లగొండ): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి మండల పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన చెర్కుపల్లి శ్రీకాంత్(28) తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో గత 4 సంవత్సరాలుగా తాత్కాలిక డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం శ్రీకాంత్ వైద్యం కోసం ద్విచక్ర వాహనంపై తిప్పర్తి నుంచి నల్లగొండకు బయల్దేరాడు. మార్గమధ్యలో అనిశెట్టి దుప్పలపల్లి సమీపంలో మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన లారీ(ఎన్ఎల్ 01 ఏహెచ్ 2987) బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించి డ్రైవర్ రిజ్వాన్‌పై కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య సుమలత ఉన్నారు. మృతుడి తల్లి చెర్కుపల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. రాజు తెలిపారు.

బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి..

కనగల్: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కింద పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్ఐ బి. రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మండలం దోనిపాముల గ్రామానికి చెందిన ఆలేటి అశోక్(21) బుధవారం బుధవారం అర్ధరాత్రి హాలియా నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో కనగల్ మండలంలోని జి. ఎడవల్లి గ్రామ శివారులో హైస్కూల్ వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అశోక్‌కు తల వెనుక బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం అతడిని నలగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా గురువారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు ఆలేటి నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుర్తుతెలియని వ్యక్తి..

నార్కట్‌పల్లి: మండల కేంద్రం శివారులో నల్లగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న లారీ నార్కట్‌పల్లి శివారులోని నల్లగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, యాచకుడిలా కనిపిస్తున్నాడని ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముందున్న ట్రాక్టర్‌ను ఢీకొని..


చౌటుప్పల్: మండల పరిధిలోని రెడ్డిబావి గ్రామం వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి సాయికుమార్(23), శివరాత్రి నవీన్(24) ద్విచక్ర వాహనంపై చౌటుప్పల్ నుంచి చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామం మీదుగా స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పంతంగి టోల్‌ప్లాజా దాటాక రెడ్డిబావి గ్రామం వద్ద జాతీయ రహదారిపై ముందున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయికుమార్ మృతిచెందాడు. వెనుక కూర్చున్న నవీన్‌కు గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలు మృతి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం గూడూరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. మిర్యాలగూడ పట్టణంలోని రాంనగర్ బంధంకు చెందిన దేవులపల్లి లక్ష్మమ్మ(65) సంతానం లేకపోవడంతో తన మేనకోడలు నిడసనమెట్ల మట్టమ్మ వద్ద నివాసముంటోంది. బుధవారం మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలో సీతారామాంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనోత్సవానికి హాజరై అదే గ్రామంలో తన మనుమరాలు ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి మిర్యాలగూడ నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మమ్మకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందింది. వృద్ధురాలి మేనల్లుడు పెద్ద లింగయ్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈజీ మనీ కోసం తప్పటడుగులు

- 28 బైక్‌లను అపహరించిన యువకుడు..
- చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన మరొకరి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

బీబీనగర్: ఈజీ మనీ కోసం చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలను గురువారం భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర బీబీనగర్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామ పరిధిలోని మాధవరెడ్డి కాలనీకి చెందిన భానుచందర్ ఈజీ మనీ కోసం అలవాటు పడి బీబీనగర్, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ఉప్పల్, మేడిపల్లి, హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగిలించి ఇతరులకు విక్రయిస్తూ ఉన్నాడు. ఇటీవల కొండమడుగు మెట్టు వద్ద ఓ ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన భానుచందర్ గురువారం పోలీసులకు అనుమానాస్పదంగా చిక్కడంతో అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా నిజం ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి 28 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. అదేవిధంగా భువనగిరి మండలం నమాత్‌పల్లి గ్రామానికి చెందిన ఎల్లెంల మధు ఇంటర్మీడియట్ తర్వాత చదువు మానేసి ట్రాక్టర్ కొనుగోలు చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా ట్రాక్టర్ ఫైనాన్స్ డబ్బులు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఈజీ మనీ కోసం దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు మధు ఈ నెల 15వ తేదీ సాయంత్రం తన స్నేహితుడు సాయికుమార్ బైక్ తీసుకుని భువనగిరి మండలం బస్వాపురం గ్రామ శివారులో తిరుగుతూ టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న దంపతులను వెంబడించి చంద్రకళ అనే మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించాడు. అనంతరం దొంగిలించిన పుస్తెలతాడును భువనగిరిలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కాగా గురువారం మధు రాయగిరి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నిజం ఒప్పుకున్నాడు. ఈ మేరకు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీసీపీ తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐలు శివనాగప్రసాద్, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మండల పరిధిలోని ఎండ్లపల్లి గ్రామ శివారులో మూసీ కాలువ పక్కన పేకాట ఆడుతున్న ఆరుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాలునాయక్ తెలిపారు. పట్టుబడిన వారిలో ఎండ్లపల్లి గ్రామానికి చెందిన చందా జానయ్య, ఎడ్ల ప్రభాకర్, సూర్యాపేట జిల్లా తాళ్లగడ్డకు చెందిన పాశం వీరయ్య, రాయినిగూడెం గ్రామానికి చెందిన చింతమల్ల వెంకన్న, ముత్యాల శేఖర్, రత్నాపురం గ్రామానికి చెందిన చందా రమేష్ ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వారి నుంచి రూ.18,360, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 31 లీటర్ల నాటుసారా, ఆటో స్వాధీనం



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ ఎల్. మహేశ్వర్‌రెడ్డి

మిర్యాలగూడ అర్బన్: ఆటోలో నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని గురువారం ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ ఎల్. మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని ఐలాపురం గ్రామానికి చెందిన బానావత్ హుస్సేన్ నాటుసారాను ప్యాకెట్లలో నింపుకుని ఆటోలో తీసుకొస్తుండగా.. ఐలాపురం నుంచి మిర్యాలగూడకు వచ్చే రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. 31లీటర్ల నాటుసారాతో పాటు ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించామని, హుస్సేన్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది జె. రాఘవేందర్, లావణ్య, ఎ. వాణి, లతీఫ్, అనిల్‌కుమార్, సుభాష్ ప్రభువరం పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకగా 'అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య'



మాట్లాడుతున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న

కోదాడఅర్బన్: ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య పనిచేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న అన్నారు. గురువారం కోదాడలోని లాల్ బంగ్లాలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ కలాలను, గళాలను శ్రామికవర్గ ప్రయోజనాల కోసం అంకితం చేసిన వారే నిజమైన కళాకారులని అన్నారు. దేశంలో ఫాసిస్టు ప్రమాదం కారుమబ్బులా కమ్ముకుంటుందని, రాజకీయాల్లోకి మతాన్ని చొప్పిస్తూ ప్రజల మధ్యన విద్వేషపు అగాథాన్ని సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. గత చరిత్రను వక్రీకరించే కుట్రలు జరుగుతున్నాయన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఫాసిస్టు శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని అన్నారు. నీళ్లు లేక పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతాంగాన్ని నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, గ్రామాల్లో తాగునీటి కొరతను తీర్చేందుకు చెరువులు నింపాలని కోరారు. సమావేశంలో అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచనపల్లి సైదులు, సమాయ కార్యదర్శి ఎర్ర ఉమేష్, ఉపాధ్యక్షుడు వెంకన్న, గుండు నాగేశ్, నర్సిరెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురుల జగడం !

- ఆధిపత్యం కోసం కోదాడలో పరస్పరం దాడులు చేసుకున్న వ్యాపారులు
- దందాలో బయటపడ్డ విభేదాలు



కోదాడ: కోదాడ కేంద్రంగా ఇసుక దందా చేస్తున్న వ్యాపారుల మధ్య ఆధిపత్యపోరు నడుస్తున్నట్లు సమాచారం. ఇసుక దందా మొత్తం తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నట్లు తెలిసింది. మూడు రోజుల క్రితం గణేష్‌నగర్ సమీపంలో రెండు వర్గాలు గొడవ పడుతుండగా పోలీసులు చెదరగొట్టినట్లు సమాచారం. బుధవారం రాత్రి మరోసారి రెండు వర్గాలు పరస్పర దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డులో వే బ్రిడ్జిని కేంద్రంగా చేసుకొని కొన్నేళ్లుగా ఓ వ్యక్తి ఇసుక వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. ఇతరుల పేరు మీద బిల్లుతో ఇసుకను తెప్పించి రిటైల్‌గా అమ్ముకుంటున్నట్లు తెలిసింది.

ఆంధ్రా వ్యాపారి రాకతో..

ఆంధ్రాకు చెందిన ఓ వ్యాపారి రాత్రి సమయంలో దొంగచాటుగా ఇసుకను టిప్పర్లలో కోదాడకు తెచ్చి ఈ వ్యాపారికే అమ్మేవాడని సమాచారం. ఇసుక వ్యాపారంలో వస్తున్న లాభాలను చూసిన ఆంధ్రా వ్యాపారి కోదాడకు చెందిన మరొకరితో కలిసి కొద్దిరోజులుగా తానే సొంతంగా ఇసుక అమ్మడం మొదలెట్టినట్లు తెలిసింది. సదరు ఆంధ్రా వ్యాపారి కోదాడకు మకాం మార్చి వ్యాపారాన్ని విస్తరించసాగాడు. పాత వ్యాపారి ఖాతాదారుల వద్దకు వెళ్లి తాను తక్కువ రేటుకు ఇసుక సరఫరా చేస్తానని చెబుతుండడంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు సమాచారం. దీనిపై మూడు రోజుల క్రితం గణేష్‌నగర్ వద్ద ఇరు వర్గాలు మాట్లాడుకుందామని సమావేశమై గొడవకు దిగినట్లు తెలిసింది. ఈ విషయాన్ని కొందరు పోలీసులకు తెలపడంతో వారు ఇరు వర్గాలను చెదరగొట్టి పంపించినట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆంధ్రా వ్యాపారి కోదాడకు చెందిన ఇసుక వ్యాపారి నిర్వహిస్తున్న వే బ్రిడ్జి వద్దకు వెళ్లి గొడవ చేసినట్లు తెలిసింది. దీన్ని మనసులో పెట్టుకున్న కోదాడ వ్యాపారి అశోక్‌నగర్‌కు చెందిన కొందరిని తీసుకెళ్లి ఆంధ్రా వ్యాపారి వద్దకు వెళ్లగా ఇరువురి మధ్య వాగ్వాదం పెరిగి మరోసారి ఇరువర్గాలు గొడవకు దిగినట్లు తెలుస్తోంది.

కేసులు నమోదు చేస్తాం

మూడు రోజుల క్రితం గణేష్‌నగర్ వద్ద కొందరు గుమికూడి గొడవ పడుతున్నారని సమాచారం రావడంతో వెళ్లి వారిని అక్కడ నుంచి పంపిచాం. బుధవారం రాత్రి డబ్బుల విషయంలో వ్యాపారులు గొడవ పడినట్లు తెలిసింది. దీనిపై వారిని పిలిచి ఫిర్యాదు చేయమని చెప్పాం. వారు ఫిర్యాదు చేయకుంటే విచారించి సుమోటోగా కేసులు నమోదు చేస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక వ్యాపారం చేసినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవు.

– టి. రాము, కోదాడ పట్టణ సీఐ

అంతా మా ఇష్టం..

కోదాడలో ఇసుక దందా మొత్తాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలని ఇరు వర్గాలు ఆధిపత్య పోరుకు దిగడం తాజా వివాదానికి కారణమని తెలుస్తోంది. కోదాడకు రాత్రి సమయాల్లో ఆంధ్రా ప్రాంతం నుంచి పదుల సంఖ్యలో లారీల్లో ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. అధికారులకు నెలవారీ మామూళ్లు ఇస్తున్నామని కొందరు, రాజకీయ నేతలు తమనే వ్యాపారం చేసుకోమంటున్నారని మరికొందరు చెబుతూ ఈ దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. లారీల్లో ఇసుక తెప్పించి నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో కొన్ని చోట్ల డంపు చేసి దాన్ని మళ్లీ ట్రాక్టర్లలో నింపి పట్టణంలో తాము చెప్పిన రేటుకు ఇసుక అమ్ముతున్నారని పలువురు అంటున్నారు. కోదాడలో సాగుతున్న ఈ దందాపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.